నేటి దినపత్రిక
# సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 28 జులై 2024 | పేజీలు 8




రాపూరు, మేజర్‌న్యూస్ :

## మలుపు తిరుగుతున్న అక్రమ లేఅవుట్ల నిర్మాణాలు

### బోర్డులు ఏర్పాటు, మాయం వెనుకున్న మతలబు ఏంటి?

- ఏడాది క్రితం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లకు ఇప్పుడు బోర్డులు ఏర్పాటు, మాయ మర్మాల వెనుక అసలు కథ ఏమిటో ?
- అసలు పంచాయతీ అనుమతులు ఉన్నాయా !
- నుడా అప్రూవల్ లేకుండానే అక్రమ లే-అవుట్ల నిర్మాణాల వెనక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు ?
- స్పందించని పారిజాత ఫార్మ్స్ యాజమాన్యం
- పూర్తిస్థాయిలో వివరణ ఇవ్వలేని రాపూరు పంచాయతీ కార్యదర్శి

రాపూరు పంచాయతీ పరిధిలోని సైదాదుపల్లి గ్రామ సమీపంలోని టోల్‌ప్లాజా సమీపంలో ఏడాది క్రితం ఏర్పాటు చేసిన లేఅవుట్ల నిర్మాణాల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అన్ని అనుమతులున్నాయి. లేఅవుట్లలో నివాసయోగానికి అవసరమైన వసతులన్నీ ఏర్పాటు చేస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేయడంతో ప్రజలు ఇక్కడ ప్లాట్స్‌ను కొనుగోలు చేశారు. అయితే ఏడాది క్రితం నిర్మించిన ఈ లే అవుట్‌కు ఎలాంటి అనుమతులు లేవని, ఇది అక్రమ లే అవుట్ అంటూ గామ పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే కొన్ని గంటల వ్యవధిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను మాయం చేసేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్లాట్స్ కు అనుమతులు ఉన్నాయా.. లేవా.. అని కొనుగోలుదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి వివరణ ఇచ్చేందుకు స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు నీళ్లు నమ్ములుతున్నారు. ఇక్కడ లేఅవుట్ల నిర్మాణం వెనుక ఉన్న అదృశ్య శక్తి ఎవరు ? ఇన్ని రోజుల తర్వాత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం ఏమిటి ? ఇవన్నీ అక్రమ లేఅవుట్లే కదా.. అనే అనుమానాలు బలపడుతున్నాయి.

గోవిందా.. గోవిందా

వివరాలు 08లో

## నారాయణ గెలుపు కోసం శ్రీవారికి మొక్కు



- గెలిచి, మంత్రి అయ్యాక మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు
- కాలినడకన తిరుమలకు వెళ్లిన నారాయణ కుమార్తె పొంగూరు సింధూర
- నేటి ఉదయం స్వామివారి దర్శనం




## దొంగతనాలకు పాల్పడే ముఠా అరెస్ట్

2లో









# దొంగతనాలకు పాల్పడే ముఠా అరెస్ట్

- చెడు వ్యసనాలకు బానిసై చోరీల వైపు..
- పాత నేరస్తుడు ప్రసాద్‌పై కాకినాడలో కేడి షీట్
- రూ.13.47 లక్షల సొత్తు స్వాధీనం
- జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ వెల్లడి



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** చెడు వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న ముఠాను నెల్లూరు వేదాయపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచిరూ.13,47,500 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కవాతు మైదానంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ దొంగతనాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గత ఎనిమిది నెలలుగా నెల్లూరు నగరం, రూరల్ పరిధిలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రత్యేక టీంతో దొంగలపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఈ క్రమంలో వేదాయపాలెం సిఐ శ్రీనివాస కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది స్థానిక గొలగమూడి రోడ్లో వాహనాలను తనిఖీ చేసి పలువురిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగలుగా తేలడం జరిగిందన్నారు. వీరిలో తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ప్రసాద్ అలియాస్ ధర్మాది దుర్గాప్రసాద్ పాత నేరస్తుడుతో పాటు పసిల సత్యనారాయణ, నెల్లూరు రామ్ నగర్‌కు చెందిన కోట హరికృష్ణ, ఈస్ట్ గోదావరికి చెందిన కామాడి శ్రీనివాసులు, నెల్లూరు ఉస్మాన్ సాహెబ్ పేట రాంనగర్ కి చెందిన మర్లపాటి శ్రీహరి, శ్రీనివాస అగ్రహారంకు చెందిన భీమవరం లక్ష్మయ్య లను అరెస్ట్ చేయడం జరిగింది అన్నారు. వారి వద్ద నుంచి 9 కేసులకు సంబంధించిన రూ.13,47,500 లక్షలు విలువ చేసే 372 గ్రాముల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి, 2 మోటార్ సైకిళ్ళు, కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువులను స్వాధీనం పరుచుకున్నామన్నారు.

### చెడు వ్యసనాలతోనే చోరీలకు..

చెడు వ్యసనాలతోనే ఈ ముఠా చోరీలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. ప్రసాద్ అనే పాత నేరస్తుడిపై కాకినాడలో కేడి సీట్ కూడా నమోదు అయిందన్నారు. మిగిలిన దొంగలతో జైల్లో పరిచయాలు ఏర్పడి గత 8 నెలలుగా నెల్లూరు నగరంలో చోరీలకు పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. వీరందరిపై షీట్ ఓపెన్ చేస్తున్నట్లు తెలిపారు.

### ప్రజలు అప్రమంతంగా ఉండాలి :

ఇళ్లకు తాళాలు వేసి బయట ఊర్లకు వెళ్లే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. తాళాలు వేసిన రోజున సమీప పోలీస్ స్టేషన్లో సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో తమ సిబ్బంది పగలు, రాత్రి గస్తీలను ముమ్మరం చేయడం జరుగుతుందన్నారు. మీ ప్రాంతంలో ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతుంటే తక్షణం పోలీస్ స్టేషన్‌కి కాని, డయల్ 100కు కానీ సమాచారం అందించాలన్నారు. ఫలితంగా వారిని అదుపులోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

### సిబ్బందికి రివార్డులు :



దొంగలను చాకచక్యంగా అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం పరుచుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అనంతరం నగదు రివార్డులను అందజేశారు. సమావేశంలో ఏఎస్పి సౌజన్య, నగర డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి, సిఐలు కిషోర్‌కుమార్, సుబ్బారావు, రోశయ్య, సుధాకర్‌రెడ్డి, మద్ది శ్రీనివాస రావు, అన్వర్ భాష, సిబ్బంది పాల్గొన్నారు.

## మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు

### రూ.5.95 లక్షల సొత్తు స్వాధీనం : ఎస్పీ కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** మారుతాళ్ళలతో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. మంగళవారం పోలీస్ కవాతు విధానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్గా మిట్ట సిఐ రోశయ్య ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిఘా ఉంచగా శబరి శ్రీరామ క్షేత్రం సమీపంలో ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు చెందిన కర్పూరం శివరామకృష్ణారెడ్డి, నెల్లూరు భక్తవత్సల నగర్‌కి చెందిన శ్రావణ్ కుమార్ లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5.95 లక్షలు విలువ చేసే15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. దర్గామిట్ట, చిన్న బజారు, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలలో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ రోశయ్య, ఎస్సై రమేష్, సిబ్బందిని అభినందించి వారికి ప్రశంస పత్రాలను అందజేశారు.

## రూరల్ డీఎస్పీని పరామర్శించిన ఎస్పీ కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఇంటికి మంగళవారం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ వెళ్ళి పరామర్శించారు. ధైర్య సాహసాలను మెచ్చుకొని, స్వయంగా ప్రశంసాపత్రం అందించి అభినందించారు. జిల్లా పోలీసు యంత్రాంగం మీ వెంటే ఉందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. త్వరగా పూర్తిగా కోలుకొని, కలిసి విధులు నిర్వహించాలని రూరల్ డీఎస్పీకి మనోధైర్యం చెప్పి, అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

అసాంఘిక కార్యకలాపాల

## అడ్డుకట్టే లక్ష్యం : ఎస్పీ

### నగర్‌లో కార్డెన్ సర్చ్ ఆపరేషన్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచటానికి కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రమంలో మంగళవారం నగరంలోని చంద్రబాబు నగర్ నందు తెల్లవారుజామున కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించి ప్రజలను అవగాహన పరుస్తున్నట్లు చెప్పారు. నగర డిఎస్పి శ్రీనివాసులు రెడ్డి, వేదాయపాలెం, దర్గా మెట్ట సీఐలు కిషోర్ కుమార్, రోశయ్య, స్పెషల్ పార్టీలతో కలిపి సుమారు 80 మందితో సుమారు 500 ఇళ్ళు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 17 బైకులు, 1 ఆటో స్వాధీనం, 7 మంది రౌడీ షీటర్స్ ఇళ్ళు తనిఖీ చేసినట్లు చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతలను పరిరక్షణ, అసాంఘీక శక్తుల ఏరివేతే లక్ష్యమన్నారు. ఆపరేషన్‌లో పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీన పరుచుకోవడం జరుగుతుందన్నారు. చంద్రబాబునగర్ పరిధిలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా శోధించారు.

మలుపు తిరుగుతున్న

## అక్రమ లేఅవుట్ల నిర్మాణాలు



తొలగించారంటూ చెబుతున్న పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులివే..

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 137, 138, 145లో పారిజాత ఫార్మ్ఫ్ ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు నుడా అప్రూవల్ లేదని ఆదివారం రాత్రి పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు సోమవారం తెల్లారేసరికల్లా మాయమవడం చర్చినీ యాంశంగా మారింది. బోర్డులు మాయం కావడంపై **"నేటి దినపత్రిక సూర్య"** పత్రికలో "రాత్రి పెట్టిన బోర్డులు.. తెల్లారే సరికి మాయం" అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించింది. హెచ్చరిక బోర్డులు తీసేసిన విషయం తెలుసుకొన్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రావు మంగళవారం నుడా అధికారులకు సమాచారం అందించి, నోటీసులు సంబంధిత యాజమాన్యానికి జారీ చేసినట్లు **'మేజర్‌న్యూస్'**కు తెలిపారు. బుధవారం సిమెంటు కాంక్రీటుతో దిమ్మెలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మళ్ళీ బోర్డులు తొలగిస్తే పోలీస్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొంటామని చెప్పారు.

## కమనీయంగా కళ్యాణ మహోత్సవం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఎమ్మార్వో కాలనీ వద్ద శ్రీకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగినాయి. రెండు రోజులపాటు జరిగిన ఈ వేడుకల్లో మంగళవారం రాత్రి శ్రీకృష్ణుడు కళ్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. ఉభయకర్తలగా నీలం మల్లికార్జున యాదవ్ దంపతులు వ్యవహరించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు మధ్య ఈ కార్యక్రమాన్ని సాగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణం చూశారు. ప్రత్యేక పుష్పాలంకరణతో కళ్యాణ మందిరం కళకళలాడింది. భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బెస్తలకు తీరని ఎస్టీజాబితా కలలు

**అమలుకు నోచుకోని హామీలు**



ఢిల్లీలో ధర్నా చేస్తున్న బెస్తసంఘీయులు, ఫైల్‌ఫోటో

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దశాబ్దాల తరబడి మత్స్యకారులైన బెస్త సంఘీయులను ఎస్టీల జాబితాలో చేర్చాలన్న కల నెరవేరలేదు. నేతలెందరో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో ఉద్యమాలు చేసిన బెస్త సంఘీయులు 2009లో ఢిల్లీలో కూడా ధర్నా చేశారు. అప్పట్లో యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వారికి హామీ ఇచ్చినా అమలు కాకపోగా 2014నుండి అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని, మత్స్యకారుల్కెన బెస్తసంఘీయులను ఎస్టీల జాబితాలో చేర్చాలని వారంతో కోరుతూనే ఉన్నా తమ కోరిక నెరవేరడంలేదని వారంతా ఆవేదనతో ఉన్నారు. 2009లో ఆంధ్రప్రదేశ్ నుండి అప్పటి రాష్ట్ర బెస్తసంక్షేమ సంఘ నాయకుడు దివంగత వీవీ శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాలకు చెందిన సంఘ నాయకులు 200 మంది ఢిల్లీకి వెళ్ళగా నెల్లూరు జిల్లానుండి ఆసంఘ జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు (ఆత్మకూరు మండలం మహిమలూరు), జిల్లా నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, మద్దినేని నారాయణ, సి.హెచ్.రాజశేఖర్‌లు కూడా వెళ్ళి పార్లమెంట్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనాదిగా అన్ని రంగాల్లో ఆర్థిక అభివృద్ధికి నోచుకోనక నానా అవస్థలు పడుతున్నామని, కుల వృత్తితో జీవనం సాగించాలంటే తగిన అవకాశాలు లేవని, తమ కులాన్ని ఎస్టీల జాబితాలో చేర్చితో అన్నిరంగాల్లో సంక్షేమఫలాలు అందుకోగలమని, అభివృద్ధి చెందగలమని కోరారు. మహారాష్ట్రకు చెందిన ఎంపి రాథోడ్, వివిధ రాష్ట్రాల అధ్యక్షులతో కలిసి తాము యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీని కలిశామని, ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం, మీరాకుమారి తదితర కేంద్రమంత్రులను కూడా కలిశామని, తమగోడు విన్నంచి వినతిపత్రాలు సమర్పించగా తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీలిచ్చారని ఆసంఘ నాయకులు పేర్కొన్నారు. 1970 నుండి పీవీ.నరశింహారావు, జలగం వెంగళరావు తదితరలంతా ప్రతిపాదించినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. నేషనల్ బీసీ కమీషనర్, ఏబిటియు, సిబిటియు కేంద్ర నాయకులకు కూడా వినతిపత్రాలిచ్చామన్నారు. దేశంలో ఆరు రాష్ట్రాల్లో మినహ మిగతాచోట్ల బెస్తలు ఎస్టీలుగా ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌తో సహ మరో ఐదు రాష్ట్రాల్లోనే బిసిలుగా ఉన్నామని వారు వివరించారు. తమ విన్నపంతో సానుకూలంగా స్పందించిన అప్పటి యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి బెస్తలను ఎస్టీల జాబితాలో చేర్చుతామని స్పష్టమైన హామీ ఇచ్చారని బెస్త సంక్షేమసంఘ జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు పేర్కొన్నారు. కానీ ఈనాటికీ ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎందరికో వినపతిపత్రాలు సమర్పించినా కేంద్రంలో అధికారంలో ఉన్న యుపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ హామీతో తప్పక తమ ఆశ నెరవేరగలదని, కోర్కె ఫలించగలదని గంపెడు ఆశ, కొండంత విశ్వాసంతో ఢిల్లీ నుండి ఆనాడు తిరిగి వచ్చామని, అప్పటినుండి వారు అధికారంలో ఉన్నంతవరకు ఆశపడి అనంతరం ఆశలు వదులుకొని నూతన ప్రభుత్వంపై ఆశతో ఉన్నామని సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈనియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, వాణిజ్యశాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డికి కూడా వినతిపత్రాలు సమర్పించామని, ఆయన ఆధ్వర్యంలో కేంద్ర ప్రముఖులకు విన్నవించేందుకు యత్నించినా ఫలితం లేకపోయిందని సుబ్బరాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బిజెపిల కూటమి ప్రభుత్వంలోనైనా వారి ఆశలు ఫలిస్తాయేమో చూడాల్సి ఉంది.

## శ్రీ నవనీత కృష్ణ స్వామి వారికి అబిషేకం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండ పై వేంచేసియున్న శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీ నవనీత కృష్ణ స్వామి వారికి అభిషేకం, రోడ్డు మార్గంలో ఉన్న శ్రీ కృష్ణ అవతారం వద్ద విశేష పూజలు, ఉట్టి మహోత్సవం కార్యక్రమాలు ప్రధాన అర్చకులు శ్రీ భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య వైబవంగా జరిగాయి. ఉభయ కర్తలుగా నెల్లూరు వాస్తవ్యులు కాళహస్తి ఆదిలక్ష్మమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించగా పై పూజ కార్యక్రమాలు లో అర్చక సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, దర్గామిట్ట, నెల్లూరు నందు వారధి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వ్యాసరచన, డిబెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జి.సుధీర్ బాబు, నెల్లూరు రూరల్ మండల విద్యాశాఖ అధికారి మురళీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి హాజరయ్యారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన పోటీలలో జడ్పీ ఉన్నత పాఠశాల సర్వేపల్లి విద్యార్థులు సంయుక్త, తేజస్విని, యశ్విన్ టీం ప్రథమ స్థానంలోనూ, జెబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోవూరు వెంకట్, శ్రీకృష్ణ, ఫరూక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వకృత్వ పోటీలలో జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు, పొదలకూరు విద్యార్థులు సుమ సాయి చరిత, శ్రీజ, తేజస్వినిలు ప్రథమ స్థానంలోనూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల బోగోలు విద్యార్థులు మహిత, సుహిత, హరిణిలు ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఉపాధ్యాయులు రత్నశేఖర్, హరికిషన్, పరమేశ్వరరావు, హరిప్రసాద్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందనలు తెలియజేశారు.

## బ్రెయిన్ స్ట్రోక్‌తో సీపీఎం నేత నజీర్ బాషా మృతి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు పఠాన్ నజీర్ భాష బ్రెయిన్ స్ట్రోక్ మృతి చెందగా ఆయన అంత్యక్రియలు మంగళవారం స్థానికంగా జరిగినాయి. సిపిఎం పార్టీ జెండాను ఆయన మృతదేహంపై ఉంచి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్, స్థానిక నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు.

# వక్ఫ్ చట్ట సవరణలు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం

**ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభహాన్**




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వక్ఫ్ చట్ట సవరణలు ఆపకపోతే అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఏ సుభహాన్ తెలిపారు. ఆవాజ్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని గాంధీ బొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు వక్ఫ్ బోర్డు చట్ట సవరణలను వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడకు వచ్చిన మైనారిటీలను ఉద్దేశించి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఏ సుభహాన్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం గత 11 సంవత్సరాల నుంచి అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. వక్ఫ్ చట్ట సవరణలతో మైనారిటీల అభివృద్ధి కోసమే ఈ చట్ట సవరణలు గొప్పలకు పోతున్నారని ఉన్న చట్టాలను అమలు చేస్తే చాలన్నారు. ఇప్పుడు కొత్తగా 40 చట్ట సవరణలు తీసుకుని వక్ఫ్ బోర్డు ని నిర్వీర్యం చేయడం తప్ప ఇంకొకటి లేదన్నారు. మత స్వేచ్ఛకు ఈ చట్ట సవరణలు విగాతం కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలు కూడా మైనారిటీలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఉందన్నారు. ఒకవేళ ఇక్కడ ఉన్న రాజకీయ పార్టీలు కూడా చట్టసవరణలకు మద్దతు తెలిపితే కచ్చితంగా రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఆవాజ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతాం అన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ మాట్లాడుతూ.. జిల్లాలో చాలా భూములు అన్ని ప్రాంతం అయి ఉన్నాయని వాటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మైనారిటీ నాయకులు జియా ఉల్ హక్ మాట్లాడుతూ.. పార్లమెంట్లో చట్ట సవరణలు తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రమంలో చాలా ఉన్నాయి వాటిని తక్షణ వక్ఫ్ అధికారులు స్వాధీన పంచుకోవాలని అన్నారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డును, వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ముస్లిం కర్తవ్యం అన్నారు. అనంతరం ఆవాజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సవరణలు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎఓకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.యజాన్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ నజీర్ భాష, షేక్ నాయబ్, షేక్ చాన్ బాషా, సయ్యద్ అన్వర్, షేక్ ఫయాజ్, షేక్ మునీర్ భాష, మైనారిటీ నాయకులు నవీద్, మౌలానా అజీజ్, ఆసిఫ్ బాషాలు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి పర్యటనకు విద్యార్థులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రెండవ సంవత్సరం, రెండవ సెమిస్టర్ పూర్తి చేసుకున్న వ్యవసాయ విద్యార్థులు మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ అసోసియేట్ డీన్ కేఎస్ఆర్ పాల్ మాట్లాడుతూ.. 80 మంది విద్యార్థులతోపాటు అధ్యాపకులు, సిబ్బంది మూడు రోజులపాటు ఈ పర్యటనకు వెళ్లనున్నారన్నారు. కడప, తిరుపతి, నెల్లూరు, కావలిలో గల వివిధ పరిశ్రమలు, కృషివిజ్ఞాన కేంద్రాలు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రగతి, యువ కేంద్రం, పరిశోధనల సంస్థలు, ఉద్యాన కళాశాలలను సందర్శించడం జరుగుతుందన్నారు. ఈ విద్యా పర్యటనతో విద్యార్థులకు అవగాహన, అనుభవం కలుగుతాయన్నారు. అనంతరం జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు నారాయణస్వామి, కిషన్ తేజ, అశోక్, క్రాంతిబోధన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# తహశిల్దారు, సీఐలను ఘనంగా సన్మానించిన టీడీపీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశిల్దారు వి.సుధీర్‌కుమార్, ఎస్ఐ షేక్ జిలానీలను మంగళవారం తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సమూహంగా వెళ్ళి కలిసి ఘనంగా సన్మానించారు. తొలుత వారంతా స్థానిక ఎస్ఐ జిలానీని కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతలు, నేరాల అదుపు, ట్రాఫిక్ నియంత్రణ గురించి పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి చర్చించారు. విధుల నిర్వహణలో తామంతా సంపూర్ణసహకారమందిస్తామని ఎస్ఐకు హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక తహశిల్దారు సుధీర్‌కుమార్‌ను కలిసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. రెవిన్యూసమస్యలు, రేషన్‌కార్డులు, పట్టాదార్ పాస్‌బుక్‌లు తదితర అంశాల గురించి చంద్రారెడ్డి తహశిల్దారుతో చర్చించి సమస్యలపరిష్కారానికి ప్రత్యేకదృష్టి సారించాలని కోరారు. విధుల నిర్వహణలో తమవంతుగా సంపూర్ణ సహకారమందిస్తామని చంద్రారెడ్డి తదితరులు తహశిల్దారుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, కౌన్సిలర్లు సూరా భాస్కరరెడ్డి, గంధళ్ళ వేణు, మాజీ ఉపమండలాధ్యక్షుడు నలిశెట్టి శ్రీనయ్య, తెలుగుదేశం నాయకులు వీరపురెడ్డి సుదర్శన్‌రెడ్డి, గొరిపర్తి నాగభూషణమ్మ, షేక్ రేష్మా, చంద్రపాటి మంగమ్మ, మాదాల మస్తాన్‌నాయుడు, తోడేటి వెంకటయ్య, దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, హయత్‌బాషా, గౌస్, కాపా వెంకటసుబ్బయ్య, తుమ్మల కొండారెడ్డి, ఖాదర్‌బాషా, పాలేటి శేషారెడ్డి, టి.పెంచలయ్య, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐను సన్మానించిన బండారుపల్లి సర్పంచ్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ షేక్ జిలానీని మంగళవారం మండలంలోని బండారుపల్లి తెలుగుదేశం నాయకుడు, సర్పంచ్ ఇప్పగుంట పెంచలయ్య తదితరులు కలిసి శాలువా, పుష్పగుచ్ఛంలతో సన్మానించి అభినందించారు. తాము ఎస్ఐ విధులనిర్వహణలో సహకారుమందిస్తామని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు, నేరాలు లేకుండా కాపాడాలని ఆయన ఎస్ఐను కోరారు. తప్పకుండా ప్రత్యేకశ్రద్ధతో అన్నీ చర్యలు తీసుకుంటామని ఎస్ఐ జిలానీ హామీ ఇచ్చారు.

# ఆత్మకూరులో నేత్రదానపక్షోత్సవాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం 39వ జాతీయనేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈనెల25 నుండి సెప్టెంబర్ 8వరకు ఈ పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. జిల్లాఅ అంధత్వ నివారణసంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శర్వాణి ఆధ్వర్యంలో ఈ అవగాహనా కార్యక్రమం నిర్వహించగా హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం పాల్గొని ప్రసంగించారు. అన్నిదానాల్లో నేత్రదానం అత్యంత గొప్పదని, ఒక్కరు చేసే నేత్రదానం ఇద్దరి జీవితాలకు వెలుగునిస్తుందన్నారు. కాబట్టి అందరూ అవగాహన చేసుకొని నేత్రదానంకు ముందుకు రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరి, ఫోరెన్సిక్ డాక్టర్ దత్తప్రసాద్, పలువురు డాక్టర్లు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నేత్ర పరీక్షలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అప్తాలమిక్ అసిస్టెంట్ బీ.సాహితీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులను పరికించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాయబ్. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యకరమై 'గార్లపాటి' ఉచితతాగునీరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు, సంగం, తోటపల్లిగూడూరు మండలాల్లో ఐదు గ్రామాల్లో గార్లపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ల ద్వారా ఉచితంగా అందిస్తున్న తాగునీరు అత్యంత ఆరోగ్యవంతంగా ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అన్నివర్గాల ప్రజలకు ఈ తాగునీటిని ఉచితంగా 2012వ సంవత్సరం నుండి గార్లపాటి సోదరులు సరఫరాచేస్తున్నారు. తాగునీరు అందుబాటులో ఉండడంతోపాటు శుద్దిచేయబడిన ఆరోగ్యకరమైన తాగునీటిని పొందుతున్నామని జనాలు చెబుతున్నారు. 2012 జనవరి1 వతేదీన ఆత్మకూరు మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ గ్రామ సర్పంచ్, గార్లపాటి ఫౌండేషన్ డ్కెరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్ నాయుడు, ఆయన సోదరులు గార్లపాటిఫౌండేషన్ చైర్మన్, ల్యాంకో గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ ఎండి,వైస్ చైర్మన్ గార్లపాటి భాస్కరనాయుడు, ల్యాంకో చెన్నైశాఖ నిర్వాహకులు, ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి సుబ్బారావులు ప్రజలకు తమవంతుగా ఆరోగ్యకరమైన తాగునీటిని అందించాలని తలంచారు. వెంటనే తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వంత నిధులతో తమ స్వగ్రామమైన కరటంపాడులో వాటర్‌ప్లాంటును ఏర్పాటుచేసి అప్పటి ఎస్ఐ ఏ.ఆంజనేయరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. ఆత్మకూరు మండలం అప్పారావు పాళెం, సంగం మండలం అమరపునాయుడు కండ్రిక, తోటపల్లిగూడూరు మండలం సౌత్ ఆములూరులలో కూడా వాటర్‌ప్లాంట్లును తమ స్వంత నిధులతో ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంటు 8లక్షల రూపాయలతో ఏర్పాటు చేశారు. ఆత్మకూరు ప్రాంతంలో మొబైల్ వైద్యవాహనం ద్వారా 12గ్రామాల ప్రజలకు వైద్యసేవలు, మందులు ఉచితంగా అందజేయడం, తమ స్వగ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 1.5కోట్ల రూపాయలు స్వంతనిధులతో నాటినుండి పలుభవనాలు నిర్మాణం, సరస్వతి విగ్రహం, మండపం ఏర్పాటు, విద్యార్థులకు ప్రతిఏటా యూనిఫారం దుస్తులు, నోటుపుస్తకాలు అందజేయడం, మెరిట్ విద్యార్థుల కార్పోరేట్ విద్యకోసం స్కాలర్‌షిప్‌లు అందజేయడంతోపాటు గ్రామంలో పాఠశాల, పంచాయతీ కార్యాలయం, శ్మశానాలు తదితరాలకు లక్షలాది రూపాయల స్వంత నిధులతో ప్రహరీగోడలు, శ్మశానాల ఆధునీకరణ, నియోజకవర్గ స్థాయిలో వికలాంగులకు తరచూ లక్షలాది రూపాయల వ్యయంతో కృత్రిమఅవయవాలు, అనేక ఉపకరణాలు అందించడం, కరటంపాడులో స్వచ్ఛతకోసం ఒక ట్రాక్టరును బహూకరించడం తదితర సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గార్లపాటి సోదరులు అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో వాటర్‌ప్టాంట్లు ఏర్పాటు చేశారు. తొలుత ప్రజల భాగస్వామ్యం కోసం 20లీటర్ల తాగునీటిని కేవలం 3రూపాయలకు ఇచ్చేలా నిర్ణయించిన గార్లపాటి సోదరులు రెండునెలలకే తమ పరిశీలనలో పేదలు ఈనీటిని పూర్తిగా పొందడం లేదని గమనించి వెంటనే అందరికీ ఉచితంగా అందించేలా నిర్ణయించారు. నాటినుండి ఆయా గ్రామాల్లో స్వచ్ఛమైన ఆరోగ్యవంతమైన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ల్యాంకో ఫౌండేషన్, గార్లపాటి ఫౌండేషన్ల ద్వారా ఆత్మకూరు ప్రాంతంలో గార్లపాటి సోదరులు చేస్తున్న సామాజిక సేవలు అమోఘంగా, అన్నివర్గాలకు అత్యంత ప్రయోజనకరంగా ఉన్నాయని కొనియాడుతున్నారు. తమ గ్రామంలో గిరిజనులు 50కుటుంబాల వారు ప్రభుత్వం పక్కాగృహాలు మంజూరు చేసి నిర్మించుకోలేని పరిస్థితిలో గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు చొరవతీసుకొని ఒక్కో కుటుంబానికి 10వేల రూపాయల వంతున ఆర్థికసాయమందించారు. తమ అనుచర నాయకుడు దావా పెంచలరావు ఆధ్వర్యంలో గిరిజనుల గృహాలను నిర్మించారు. కరటంపాడులో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంటు నుండి తాగునీటిని తమ గ్రామస్థులేకాకుండా సాతానుపల్లి, శ్రీనివాసపురం, రామాపురం, ఆరవేడుజంగాలపల్లి, బి.చిరువెళ్ళ తదితర గ్రామాల వారు కూడా తీసుకెళుతున్నారు. ఆత్మకూరులో పలు కాలేజిల వారు తమ బస్సులు ఈమార్గంలో విద్యార్థులకోసం వస్తుండగా ప్రతిరోజూ వారు కూడా కరటంపాడు ప్లాంటునుండి తాగునీటిని తీసుకెళుతుండేవారు. అత్యంత ధాతృత్వస్వభావం, సేవానిరతి, ఉదారస్వభావం, ఉన్నత మనస్థత్వం కలిగిన వేణుగోపాల్‌నాయుడు, భాస్కరనాయుడు,సుబ్బారావులు ప్రజల ఇబ్బందులు గమనించి ఆత్మకూరు ప్రభుత్వ జిల్లావైద్యశాలకు ఒక టివి, కొన్ని వైద్యపరికరాలను సమకూర్చారు. సబ్‌జ్కెలుకు ఒక టివిని బహూకరించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రజలు వేచిఉండేలా బెంచీలు ఏర్పాటు చేయించారు. సబ్‌ట్రెజరిలో తరచూ విద్యుత్‌సరఫరాలేక ఇబ్బందిగా ఉందని గతంలో వారు తెలుపగా ఒక ఇన్‌వర్టర్‌ను కూడా విరాళంగా సమకూర్చారు. ఏదేమైనా గార్లపాటి సోదరుల దాతృత్వం, సామాజికసేవలను అందరూ కొనియాడుతూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# కురువ వీధిలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

- యాదవ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు
- ఊరేగింపు కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** సీతారామపురం గ్రామ పరిధిలోని కురువ వీధిలో మంగళవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ యాదవ్ కమిటీ నిర్వాహకులు బండి మధు, ఆరేళ్ల కాశి, బండి సురేష్, గంటల రమణ, ఆదోని నాగరాజు, ఆదోని నారాయణ, బండి రవికుమార్, ఆదోని శ్రీకాంత్, ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ పరమాత్మ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ.. శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన సారాంశం ప్రతి ఒక్కరూ పాటించినప్పుడే సమాజం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. మంగళవారం రాత్రి సీతారాంపురం గ్రామపురవీధుల్లో శ్రీకృష్ణుడిని ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పిన్ని బోయిన వెంచల బాబు యాదవ్, ఉదయగిరి యాదవ సంఘం నాయకులు బయన్న, హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం సర్పంచ్ కొడవటి కంటి భాగ్య కుమారి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కప్పా ప్రభాకర్ రాజు, మండల యాదవ సంఘం నాయకులు బండి రామయ్య, సింగాల నాగేష్, బండి రవికుమార్, మండలములోని యాదవ సంఘం ప్రతినిధులు అంతా పాల్గొని జయప్రదం చేశారు.

# ఇసుక కొరత సమస్యను పరిష్కరించాలని ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఇసుక కొరత సమస్యను పరిశీలించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ వద్ద నుండి ర్యాలీ కలెక్టర్ ఆఫీస్ వరకు అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక కొరత వలన అనేకమంది భవన నిర్మాణ రంగంలో పనిచేసేటటువంటి కార్మికులు అడ్డాలలో పని కోసం ఉదయం నుండి ఎదురు చూసి చివరకు పని లేక ఇంటికి పోయేటటువంటి పరిస్థితి వచ్చింది. ఇసుక అందని కారణంగా నెల్లూరు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మంది పని లేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా నిర్మాణరంగం మీద ఆధారపడి సిమెంట్ గోడౌన్‌లు, పెయింటింగ్ షాపులు, ఐరన్ షాపులలో యజమానులకు కానీ అక్కడ పని చేసేటటువంటి కార్మికులకు కూడా పని లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వలన భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించేటటువంటి 40 రకాల పనులు నిలిచిపోయాయి. లక్షలాదిమంది కార్మికులు అప్పులతో జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం ఆలోచించి ఇసుకను నిర్మాణ రంగానికి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష కార్యదర్శులు ఆవుల పెంచలయ్య, ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇసుక లేని కారణంగా లక్షలాదిమంది భవన నిర్మాణ కార్మికులు అప్పులతో అర్ధ ఆకలితో జీవిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇసుకను నిరంతరాయంగా సరఫరా చేయాలని, ఇసుక కొరత తీర్చకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పి.సూర్య నారాయణ, ఎం.చిరంజీవి, ఎన్.వెంకట్రావు, శేషం వెంకయ్య, మల్లికార్జున, కె.శ్రీనివాసులు, కన్నయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కావలి పట్టణం అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుంది

**కావలి రూరల్ ప్రాంతవాసులకు శుభవార్త చెప్పిన ఎమ్మెల్యే**



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం తెలుగు దేశం పార్టీ శాసనసభ్యులు కావలి పట్టణాన్ని అభివృద్ధి పరిచేందుకు రోజురోజుకు ముందడుగు వేయుచున్నారు. కావలి రూరల్ మండలం ప్రాంతమైన తుమ్మలపెంట, అన్నగారిపాలెం, ఒట్టూరు, సముద్ర తీరంలో ఉన్న గ్రామాలు నిత్యం కావలి పట్టణానికి కొన్ని వందల వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నోసార్లు ప్రతిపక్ష నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు రోడ్డు గురించి ఎన్నో పోరాటాలు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని సాధించింది. కావాలని నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో కావలి నియోజక వర్గం ప్రజలు ఏరి కోరి గెలిపించుకోవడం జరిగింది. ఎందుకంటే కావ్య కృష్ణారెడ్డి అంటే ఒక నమ్మకం అనే ఉద్దేశంతో అభివృద్ధి చేయ గల శక్తి సామర్థ్యాలు గల సమర్థుడని నియోజకవర్గ ప్రతి వర్గము ఆయనకు వెన్నంటి ఉండి గెలిపించారు. అదే నమ్మకంతో ఈరోజు కావలి నియోజక వర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. అలాగే సెప్టెంబర్ 1వ తేదీన కావలి ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన ముహూర్తం ప్రారంభమైంది. 9 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి మహిళల చేత శంకుస్థాపన చేయించి, డిసెంబర్ 31 నాటికి తుమ్మలపెంట రోడ్డు పనులు పూర్తి చేస్తామని, కావలి శాసనసభ్యులు ఈరోజు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మండలములో ఉన్న గ్రామాల్లోని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా పాదయాత్ర రోజు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పట్టణవాసులు ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండలం అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకట్రావు, టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శులు జ్యోతి బాబూరావు, మొగిలికల్లయ్య మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, తిరువీధి ప్రసాద్, మస్తాన్, రఫీ, దేవకుమార్, రూరల్ మండలం నాయకులు జనసేన నాయకులు సమ్మన వెంకటసుబ్బయ్య, బొబ్బసాయి, విటల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంస పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ యాప్‌ని అత్యధికంగా వినియోగించి సామాజిక మాంధ్యమాలలో తెలుగుదేశం పార్టీకి అనంత ప్రచారం కల్పించిన అంబటి కిషోర్ చౌదరి ప్రళయకావేరి, సాయి శివరాం, దేవరపాటి నాగేశ్వరరావు కావలి జగన్మోహన్రావు తటవర్తి సాయిచరణ్, పట్నం బాలకృష్ణ, నక్కలరవి, కంచర్ల సీతారాములకు తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సంతకం చేసి పంపిన ప్రశంసా పత్రాలను కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి మంగళవారం స్థానిక ముసునూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే పార్టీ కార్యక్రమాలను సామాజిక మాంధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేసి విస్తృతంగా ప్రజల్లోకి ఈ ప్రచారాన్ని తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## తహసిల్దార్‌ను సన్మానించిన జనసేన నాయకులు



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండల తహసిల్దార్ వీర వసంతరావును మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నాయకులు శాలువాతో సత్కరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, ఇసుక మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కంటే శ్రీనివాస్ భరత్, మండల అధ్యక్షుడు ఉదయగిరి రవి, నాయకులు జయప్రసాద్, బంక రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళనకరంగా ఉన్న మలుపులు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు ప్రాంతంలో పలుచోట్ల రోడ్డు మలుపులు ఆందోళనకరంగా ఉన్నాయని, సంబంధిత అధికారులు పరిశీలించి ప్రమాదకరంగా లేకుండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మండలంలోని కరటంపాడు-అరవేడుజంగాలపల్లి మార్గంలో బగ్గేరుపై ఓ కల్వర్టును జెడ్ ఆకారంలో నిర్మించారు. ఇది ఆందోళన కరంగా ఉన్నందున వాహనకారులు, ప్రధానంగా ద్విచక్రవాహనకారులు మరింతగా ఇబ్బందిపడుతుంటారు. ఈ కల్వర్టు స్థానంలో హైలెవల్ వంతెన నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఆత్మకూరు-వింజమూరు మార్గంలో తాతిరెడ్డిపల్లి వద్ద కూడా వాగుపై జెడ్ ఆకారపు మలుపు ఉంది. అక్కడ గతంలో ఒక ఆర్టీసీ హైటెక్ బస్సు, పలు లారీలు, ట్రాక్టర్లు ప్రమాదానికి గురయ్యాయి. అక్కడ కూడా వంతెన నిర్మించి అందరి ఆందోళన తొలగించాలని కోరుతున్నారు. ఆత్మకూరు బట్టేపాడు మార్గంలో కూడా శివార్లలోని మలుపు ఆందోళన కరంగా ఉన్నందున సక్రమంగా కల్వర్టు నిర్మించాలని కూడా ఆమార్గంలో ప్రయాణించేవారు కోరుతున్నారు.

# పీసీ అండ్ పీఎనీటీ యాక్ట్ అమలపై సమీక్ష సమావేశం




**నెల్లూరు (వైద్యం), మేజర్‌న్యూస్ :** పీసీ అండ్ పీఎనీటీ యాక్ట్ అమలు తీరుతెన్నులుపై జిల్లాస్థాయి సలహా మండలి సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య అధ్యక్షతన మంగళవారం డిఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య మాట్లాడుతూ.. లింగ నిష్పత్తి ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–5 సర్వే ప్రకారం ప్రతి 1000 మంది బాలురకు:1011 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ఈ నిష్పత్తి తగ్గకుండా ఇంకా మెరుగుపరుచుటకు కమిటీ సభ్యులతో ఆకస్మిక తనిఖీలు స్కానింగ్ కేంద్రాలపై నిర్వహించుటకు కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్కానింగ్ కేంద్రాలు చట్ట పరిధిలోకి లోబడి నిర్వహించాలని, ప్రతినెల 2వ క్రమం తప్పకుండా నివేదికలో జిల్లా కార్యాలను సమర్పించాలని డిఎం అండ్ హెచ్ ఓ సూచించారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాల పైన మరింత అవగాహన కార్యక్రమాలను రూపొందించి ఎన్జీవోలను భాగ్యసభలు చేసి తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. జిల్లా మెడికల్ బోర్డు సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో సరోగసి పద్ధతి ద్వారా సంతానం కావాలనుకున్న వారి దరఖాస్తులను పరిశీలించడం జరిగింది. సరోగసి ద్వారా సంతానం కావాలనుకున్నవారు దళారులను నమ్మి మోసపోవద్దని అందుకు సంబంధించిన సలహాలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ పిఎల్ దయాకర్, డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ ఇందిరా, డాక్టర్ సర్దార్ సుల్తానా, డాక్టర్ సిహెచ్ కిరణ్, కుసుమకుమారి కవితరెడ్డి, ఐ.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, కే.కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## కాలువ పూడికతీత పనులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మంగళవారం ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 37వ డివిజన్, రాంనగర్, క్రాంతి నగర్‌లలో కాలువ పూడికతీత పనులను పర్యవేక్షించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, నగర మాజీ మేయర్ నందిమండలం భాను శ్రీలు పర్యవేకషించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కలువపూడికతీత పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత స్థానిక నాయకులపైన కూడా ఉందని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగానే డ్రైనేజీ కాలువ పూడికతీతలు తీస్తున్నారని అన్నారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. నగర ప్రజలకు వర్షాకాలంలో ఇబ్బంది లేకుండా డ్రైనేజీ కాలువల్లో పూడికతీతల పనులు జరుగుతున్నాయని మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ జలదంకి సుధాకర్, టీఎస్ శ్రీనాథ్, రమేష్ చౌదరి, మిద్దె శ్రీనాథ్, కార్తీక్, మహేష్, సురేష్, పివి. రాజేష్, శ్రీనివాసులు, అఖిల, రవి, హరి, రమణారెడ్డిలు పాల్గొన్నారు.

# ఆత్మకూరు సీఐకు ప్రశంశాపత్రం అందజేసిన ఎస్పీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు సీఐ జి.గంగాధరరావుకు మంగళవారం జిల్లా ఎస్పి కృష్ణకాంత్ ప్రశంశాపత్రం అందజేసి ఆయన సేవలకు అభినందనలు తెలిపారు. ఇటీవల జిల్లాలోని వెంకటాచలం వద్ద గంజాయి స్మగ్లర్లను అక్కడి డీఎస్పీ తదితరులు అడ్డుకోవడం, దుండగులు డీఎస్పీని కారుతో ఢీకొని పారిపోవడం, ఈసంఘటన జిల్లాలో సంచలనం కావడం తెల్పిందే. కాగా వారిలో ఒక దుండగుడు కారులో బద్వేలు వైపు వెళుతున్న సమాచారాన్ని పసిగట్టిన ఆత్మకూరు సిఐ తమ సిబ్బందితో దారికాచి చాకచక్యంగా పట్టుకున్నారు. ఈనేపద్యంలో సిఐ గంగాధరరావు వాహనం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్ళడం, ఆయనకు గాయాలు కావడం జరిగింది. ఎట్టకేలకు దుండగుణ్ణి అదుపులోకి తీసుకున్నారు. వృత్తిధర్మం కోసం ప్రాణాలుపణంగా పెట్టి దుండగుడిని పట్టుకున్న సీఐ గంగాధరరావుకు జిల్లా ఎస్పి కృష్ణకాంత్ ప్రశంశారివార్డును బహూకరించారు. దుండగుణ్ని పట్టుకునే కార్యక్రమంలో పాల్గొన్న మర్రిపాడు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్, ఇతర కానిస్టేబుల్స్‌కు ఎస్‌పి ప్రశాంశాపత్రాలు బహూకరించారు.



## రైల్వే రోడ్డులో ఆక్రమణను తొలగింపు



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో స్థానిక రైల్వే రోడ్డు గీతా మందిరం సమీపంలో కబడ్డీ షాపును ఆక్రమించుకొని వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే ఇది పూర్తిగా ఆక్రమణ అని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు దీన్ని మంగళవారం తొలగించారు. అయితే ఎన్నో సంవత్సరం నుండి ఈ షాప్ పెట్టుకుని వ్యాపార లావాదేవులు జరుపుతున్నారని ఈ స్థల యజమాని వైసీపీ నాయకులు కనుమర్లపూడి వెంకట్ నారాయణ తెలిపారు. ఈ స్థలానికి సంబంధించిన స్టే ఆర్డర్ కాగితాలు ఉన్నాయని ఈ స్థలం నాది అని చెప్పినప్పటికీ కూడా మున్సిపల్ అధికారులు అది మున్సిపల్ స్థలమని తొలగించారు.

# ఇవేనా మా చదువులు..



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** చిన్నారి పిల్లలచే విద్యను అభ్యసించి పెన్ను పట్టుకొని ముందుకెళ్లాలని ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఆ చిన్నారులచే కత్తి గడ్డపార పట్టుకొని పనులు చేయమంటే ఎలా ఉంటుందో ఈ చిత్రం చూస్తే స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ పరిస్థితి మర్రిపాడు మండలంలోని సన్నువారుపల్లి ప్రాథమిక పాఠశాల చదివేటటువంటి ఒకటి రెండు తరగతులు చదివే విద్యార్థులు మంగళవారం స్థానిక ప్రహరీ గోడ వద్ద చిన్నారులు కత్తిని వాడుకొని కంపు చెట్లను తొలగించడంతోపాటు గడ్డపార ఉపయోగించి వారిని పనిలేటి దింపడం ఎంత విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఈ తంతు ప్రతి పాఠశాలలో నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒకటి రెండు తరగతుల్లో నెలకొనే ఈ విద్యార్థులకు ఇంత పని చెప్పినప్పుడు మిగతా తరగతులు సంబంధించి విద్యార్థులకు ఎంత పని చెప్తారో అర్థం కావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులచే నెలకొన్న ఈ పనులను నివారించాల్సిందిగా విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

# వేలంగిణీ మాత జన్మదిన వేడుకల గోడపత్రికలు విడుదల



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కొత్త కోడూరు సముద్ర తీరాన వెలిసిన వేళాంగిణి మాత జన్మదిన మహోత్సవాలు సెప్టెంబర్ 6, 7, 8వ తేదీలలో శుక్రవారం శనివారం ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు పుణ్యక్షేత్ర విచారణ గురువులు, డైరెక్టర్ పినపాటి లోకాస్ రాజు తెలిపారు. మంగళవారం వేళాంగిణి మాత ఆలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆగస్టు 29న జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. ఏసుప్రభు తల్లి మరియమ్మ జన్మదినం సెప్టెంబర్ 8 ఆదివారం కావడంతో ప్రార్థనల ద్వారా ఆమెకు భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తారన్నారు. తిరునాళ్ల రోజులలో భక్తులకు భోజన వసతి ఏలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ద్వారా ఆత్మకూరు బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఉదయం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల పోస్టర్ను ఆవిష్కరించారు. బీచ్ రహదారి మార్గం మరమ్మత్తులు చేయడంలో కృషిచేసిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి రాష్ట్ర టిడిపి కార్యదర్శి బొమ్మి సురేంద్ర స్థానిక నేత వీరబోయిన గంగాధరకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహాయ గురువులు సింహం సాగర్‌బాబు జోసఫ్ తంబి పుణ్యక్షేత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అలుపెరగని సంఘ సేవకుడు నాగసాయి సూరి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ వాసి, సంఘ సేవకుడు ఏ లాభాపేక్ష లేకుండా అలుపు ఎరగని సేవకుడు భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి మంగళవారం తెలిపారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా గూడూరులో డిఆర్‌డబ్ల్యు కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ప్రసార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు దశాబ్దాల సంఘ సేవకుడు సామాజిక చైతన్య శీలి మాలకొండ రెడ్డిని ఘనంగా అభినందించి సత్కరించారు. అనంతరం సూరి మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞానాన్ని విద్యార్థులకు, యువతకు అందిస్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివిధ జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాలకొండ రెడ్డి ని పలువురికి ఆదర్శ రాయుడని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి నారాయణ మెడికల్ కాలేజ్ కళాశాల ప్రిన్సిపల్ కన్నన్, జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర పర్వంగ శ్రీకృష్ణుని కళ్యాణోత్సవం

**సాంప్రదాయ బద్ధంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం**



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకి యాదవ వీధిలోని శ్రీకృష్ణుని మందిరంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణునిమందిరంలో ముందుగా విశ్వశాంతి హెూమం నిర్వహించారు. భక్తులు విష్ణు శాస్త్ర నామ పారాయణంతో హరినామ సంకీర్తనలతో మందిరం ప్రతిధ్వనించింది, రాధా రాధా పార్థ్యులను ప్రత్యేక సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుని కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పొద్దుబోయే వరకు కూడా హరే కృష్ణ నామ స్వరంతో పరిసరాలను భక్తులు మారుమోగించారు. సాయంత్రం ఉట్టి ఉత్సవంలో శ్రీకృష్ణుని, గోపికల వేషధారనలతో ఉట్టి మహెూత్సవంలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.




సూర్య www.suryaa.com

రిపోర్టర్స్ కావలెను

తెలుగు పత్రికా రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దిన పత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకుల కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని అల్లూరు, దగదర్తి, మనుబోలు, కొడవలూరు, కోవూరు, రాపూరు, ఇందుకూరుపేటలలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

సూర్య కార్యాలయం, మిలిటరీ కాలనీ, రోడ్ నెం.1, LIC & CID ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు. సెల్: 9000 118811


# నీటి పథకానికి మోక్షం ఎప్పుడో.?

- 22 లక్షలు నీటిపాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- తాగునీటికి ప్రజలు ఇబ్బంది



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వావిళ్ళ పంచాయతీ ఉప్పలపాడు నందు గత ప్రభుత్వంలో నిర్మించిన రక్షిత మంచినీటి సరఫరా పథకం నిరుపయోగంగా మారింది. ఈ పథకాన్ని ఎన్ఆర్‌డిడబ్ల్యుపి నిధులు కింద దాదాపు 22 లక్షల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ పిచ్చి చెట్లు మధ్య శిథిలావస్థకు చేరుకోవడం విశేషం. ఈ ట్యాంక్ నుంచి ఒక్క నీటి బొట్టు కూడా సరఫరా కాకుండా నిధులు మంజూరు చేసుకుని కాంట్రాక్టర్ లబ్ది పొందాడని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై అటు ఆర్డబ్ల్యుఎస్ అధికారులు కానీ ఇటు పంచాయతీ అధికారులు కానీ పొంతనలేని సమాజంలో చెప్పటంతో ప్రజలు నిర్వేరపోతున్నారు. దాదాపు 22 లక్షల రూపాయలు ప్రజల డబ్బు దుర్వినియోగం అయితే అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. పేదల నివసించడానికి ఇళ్ల పట్టాలను ప్రభుత్వం వారు మంజూరు చేశారు ఆ స్థలాలలో డెవలప్ మెంట్ కొరకు గ్రావెల్ రోడ్లు రోడ్లు ప్రక్కన చెట్లు పెంచడానికి రెండున్నర లక్షల రూపాయల అంచనా విలువ వేసి ఉపాధి హామీ నిధులను ఖర్చు చేశారు. అయితే నేడు ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకొని ఆ ఇంటి స్థలాలలోనికి ఎవరు రాకుండా వీధులను సైతం ఆక్రమించుకుంటున్నారు. కోవూరు నియోజక వర్గాన్ని అవినీతి రహిత నియోజకవర్గంగా మారుస్తున్న శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దుర్వినియోగం అవుతున్న ప్రజల సొమ్మును విచారించి వెలికి తీయించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు ఆదేశించాలని ప్రజలు కోరుకుంటున్నారు. అంతేకాకుండా తాగునీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజలు దాహార్తిని తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు

**నేడే సింగనపల్లి ఎస్సీ కాలనీలో విగ్రహ ప్రతిష్ఠ**



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని సింగనపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ఆలయం వద్ద బుధవారం నరసింహ స్వామి విగ్రహాలను ప్రతిష్టించునున్న తరుణంలో ఈ పూజలు నిర్వహించడం జరిగింది. వేద పండితులతో వేదమంత్రాలు చదువుతూ ప్రత్యేక హెూమాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులు అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు చేశారు. అందుకు సంబంధించి ఆలయ కమిటీ ఉభయకర్తలు గ్రామ పెద్దలు లక్ష్మీనరసింహస్వామి భక్తులు ఎస్సీ కాలనీ వాసులు పాల్గొని పూజలను విజయవంతంగా చేశారు.

# గోవిందా.. గోవిందా

- నారాయణ గెలుపుకోసం శ్రీవారికి మొక్కు
- గెలిచి, మంత్రి అయ్యాక మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు
- కాలినడకన తిరుమలకు వెళ్లిన నారాయణ కుమార్తె పొంగూరు సింధూర
- రేపు ఉదయం స్వామివారి దర్శనం



**నెల్లూరు క్రైమ్, మేజర్‌న్యూస్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ పొంగూరు నారాయణ గెలుపుకోసం టీడీపీ నేతలు, కార్యకర్తలు నిరంతరం శ్రమించారు. ఆయన భారీ మెజార్టీతో గెలిస్తే తిరుమల కొండకు వచ్చి మొక్కు తీర్చుకుంటామని, ఆ కలియుగ దైవం వేంకటేశ్వరుని స్వామికి వారంతా మొక్కుకున్నారు. ఎన్నికల్లో 70 వేలకు పైగా మెజార్టీతో గెలవడంతో.. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో.. స్థానిక 47వ డివిజన్ నాయకులు ధర్మవరపు గణేష్‌తోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు మంగళవారం అలిపిరి నుంచి తిరుమల వరకు కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. వీరితోపాటు మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె.. పొంగూరు సింధూర ఉన్నారు. ఆమె పర్యవేక్షణలో.. వారంతా భక్తి శ్రద్ధలతో కాలి నడకన గోవింద నామాల స్మరణలతో సంతోషంగా వెళ్లారు. వారంతా గురువారం ఉదయం తిరుమల వేంకటేశ్వరుని దర్శించుకోనున్నారు.

## ఉర్దూ పాఠశాలలను తనిఖీ చేసిన డీఐ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని హసనాపురం అనుమసముద్రం ఏఎస్పేట గ్రామాల్లోని ఉర్దూ పాఠశాలలను జిల్లా ఉర్దూ డీఐ షేక్ ఖాజా మోహిద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హసనాపురంలో ఉన్న ఉర్దూ ఎంపీపి పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం (ఎన్రోల్మెంట్) చాలా తక్కువగా ఉందని విద్యార్థుల ఎన్రోల్మెంట్ పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థుల సామర్థ్యలను, పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అనుమసముద్రంపేటలో ఉన్న ఉర్దూ ఎంపీయూపీ పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలో ఎస్.ఏ ఉర్దూ అవసరం ఉన్నదని తెలిపారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం జరుగుతున్న మార్పులను గమనిస్తూ ఉపాధ్యాయులు ఎప్పటి కప్పుడు అప్డేట్‌గా ఉండాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు ముందంజలో ఉండాలని కోరారు. అనంతరం పాఠశాలలో డొక్కా సీతమ్మ బడి భోజనంను తిని సంతృప్తి వ్యక్త పరిచారు. అనుమసముద్రం మెయిన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల యందు ఉన్న ఉర్దూ సెక్షన్ పోస్టులను పరిశీలించి విద్యార్థుల ఉర్దూ సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జలదంకి తహసిల్దార్‌ను కలిసిన సర్పంచ్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల తహసిల్దారుగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన హేమంత్ కుమార్‌ను కేశవరం సర్పంచ్ రావి ప్రసాద్ నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జలదంకిలోని తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్‌ని శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చోడవరం మాజీ సర్పంచ్ నన్నూరి ఆరోన్ తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల ఎస్ఐగా అనూష నియామక ఉత్తర్వులు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం సోమశిల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సీతారాంపురం మండల ఎస్ఐగా పనిచేసిన అనుష నియామకం కానుంది. జిల్లా ఎస్పీ ఉత్తరువుల మేరకు బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించనుంది. నిన్నటి వరకు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చిన వి.సుబ్బారావు నెల్లూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు.